క్లుప్తంగా

5న ధ్వజస్తంభ ప్రతిష్ఠ

కొయ్యలగూడెం: సీతంపేటలోని శ్రీ ఉమా రామలింగేశ్వర శివాలయంలో ఈనెల 5వ తేదీన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ పూజలకు సంబంధించి ఆలయంలో యాగశాలను నిర్మించారు. ఉత్సవాలకు సంబంధించి ఆలయాన్ని ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. జాతీయ ప్రధాన రహదారి పక్కన గల శివాలయం ప్రాంగణంలో ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లు ఆధ్యాత్మిక కార్యక్రమాలను ప్రారంభించారు. శివాలయంతో పాటు గ్రామంలోని ఆలయాలను ప్రత్యేకంగా ముస్తాబు చేశారు.

నేడు కనకదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం


విశేషాలంకరణలో కనకదుర్గమ్మ తల్లి

జంగారెడ్డిగూడెం: స్థానిక హైస్కూల్ వద్ద వేంచేసి యున్న శ్రీ కనక దుర్గమ్మ అమ్మవారి ఆలయ 31వ వార్షికోత్సవం సోమవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ భక్త బృందం తెలిపింది. వార్షికోత్సవంలో భాగంగా సోమవారం ఉదయం 8 గంటలకు ఆలయంలో చండీహోమం నిర్వహించనున్నట్లు చెప్పారు. జ్యోతిష్య, వాస్తు, ఆగమ సిద్ధాంతి ఈరంకి సుబ్రహ్మణ్య వర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

గ్రంథాలయంలో అంతర్జాతీయ బాలల దినోత్సవం


ప్లకార్డులు ప్రదర్శిస్తున్న చిన్నారులు

కొయ్యలగూడెం: కన్నాపురం రోడ్డులోని శాఖా గ్రంథాలయంలో ఆదివారం అంతర్జాతీయ బాలల దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు అంతర్జాతీయ బాలల దినోత్సవ ఆవశ్యకతను లైబ్రేరియన్ యు.రాముడు వివరించారు. అనంతరం విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ప్లకార్డులను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు ఈనెల 6న బహుమతులు అందజేస్తామని స్పందన స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు బలుసు నాగేశ్వరరావు పేర్కొన్నారు.

సర్పంచ్ మోహన్‌కు విజయరాజు పరామర్శ


మోహన్‌ను పరామర్శిస్తున్న విజయరాజు

చింతలపూడి: యండపల్లి సర్పంచ్ యడ్ల మోహన్‌ను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు ఆదివారం పరామర్శించారు. మోహన్ ప్రమాదంలో కాలికి గాయమై ఆపరేషన్ చేయించుకుని కోలుకుంటున్న సమయంలో మళ్లీ ఇన్ఫెక్షన్‌కు గురై ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఆయన్ను పరామర్శించారు. ఆయన వెంట పార్టీ నాయకులు త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, ఎం ఇమ్మానియేలు, ఎస్ దుర్గారావు, ఎస్ కాంతారావు, ఎ సుబ్బారావు, ఎం దిలీప్ , గోల్కొండ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన బాలు గాన లహరి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): మధుర గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 79వ జయంతిని పురస్కరించుకుని హేలాపురి సింగర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలు గాన లహరి కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వైఎంహెచ్ఏ హాలులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దివంగత ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వివిధ చలనచిత్రాల్లో ఆలపించిన సూపర్‌హిట్ గీతాలను గాయకులు శ్రావ్యంగా ఆలపించి ప్రేక్షకులను అలరించారు.

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుడి గుర్తింపు

ఏలూరు టౌన్: ఏలూరు జాతీయ రహదారిపై కలపర్రు పాతటోల్‌ప్లాజా సమీపంలో ముందుగా వెళ్తున్న కారు ఆకస్మికంగా బ్రేక్ వేయటంతో వెనుక మోటారు సైకిల్‌పై వెళ్తున్న యువకుడు కారును ఢీకొనటంతో తీవ్రగాయాలతో మృతిచెందాడు. మృతుడి వివరాలను పోలీసులు ఆదివారం గుర్తించారు. మే 31న రాత్రి వేళ కలపర్రు పాతటోల్‌ప్లాజా సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలైన యువకుడిని ఏలూరు జీజీహెచ్‌కు తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. గణపవరం మండలం కుమ్మర గ్రామానికి చెందిన అడ్డగళ్ళ శ్రీనివాసరావు (35) విజయవాడ నుంచి వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఏలూరు జీజీహెచ్ మార్చురీలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మహిళల సంక్షేమానికి మంగళం

- బాబు పాలనలో కష్టాలు పడుతున్న మహిళలు
- తల్లికి వందనం, ఉచిత బస్సు, ఆడబిడ్డ నిధి ఇస్తామంటూ ఎన్నికల్లో హామీలు
- ఏడాది పాలన పూర్తయినా వాటి ఊసెత్తని కూటమి ప్రభుత్వం


జగన్ ప్రభుత్వంలో బుట్టాయగూడెంలో మహిళలకు ఆసరా చెక్ అందజేత (ఫైల్)


గత ప్రభుత్వంలో చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెంలో మహిళల పేరిట ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మాణం చేపట్టిన దృశ్యం (ఫైల్)

చింతలపూడి: ప్రతి మహిళకు నెలకు 1,500 ఖాతాలో జమ చేస్తాం.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తాం.. ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు అందజేస్తాం.. తల్లులకు ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి సంవత్సరానికి 15,000 తల్లికి వందనం పేరిట ఇస్తాం అంటూ ఎన్నికలకు ముందు చంద్రబాబు సహా కూటమి నేతలు ఊదరగొట్టారు. తీరా అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా వాటి అమలుకు మీనమేషాలు లెక్కిస్తున్నారు. మరో పదో రోజుల్లో బడులు తెరవనున్నా ఇప్పటివరకు తల్లికి వందనం గురించి ఊసే లేదు. ఇదంతా మహిళల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం మంగళం పాడుతుందేమోనని మహిళలు ఆందోళన చెందుతున్నారు.

గత ప్రభుత్వంలో మహారాణుల్లా.. మహిళలు

గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఐదేళ్లలో నూరు శాతం అమలు చేసి చూపించింది. ప్రతి పథకంలోనూ మహిళలను భాగస్వామ్యం చేస్తూ మహిళల స్వయం సమృద్ధి కోసం కృషి చేసింది. ముఖ్యంగా పొదుపు సంఘాల మహిళలను వ్యాపార రంగంలోకి ఆహ్వానించి వివిధ వ్యాపారాల్లో భాగస్వామ్యం చేసి ప్రోత్సహించారు. అందులో భాగంగా ప్రతి నియోజకవర్గంలో పూర్తిగా మహిళల భాగస్వామ్యంతో మహిళా మార్ట్‌లకు శ్రీకారం చుట్టారు. మహిళల ఆర్థిక అభివృద్ధే లక్ష్యంగా వైఎస్ జగన్ పాలన సాగింది. అమ్మ ఒడి పథకంలో 28,966 మంది తల్లులకు రూ. 124.14 కోట్లు, వైఎస్సార్ చేయూత ద్వార 17,269 మంది లబ్ధిదారులకు రూ.73.92 కోట్లు, ఆసరా పథకంలో 5,962 గ్రూపులకు 265.62 కోట్లు, వైఎస్సార్ సున్నా వడ్డీ కింద 60,586 లబ్ధిదారులకు రూ.32.23 కోట్లు, వైఎస్సార్ కాపు నేస్తం ద్వారా 3,294 మంది మహిళలకు రూ.13.12 కోట్లు, ఈబీసీ నేస్తం కింద 2,409 మంది మహిళలకు రూ.6.58 కోట్లు, నియోజకవర్గంలో 12 వేల మంది మహిళలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతిగా నిలిచారు.

నారీ లోకానికి.. నారా వారి శాపం

బుట్టాయగూడెం: ఎన్నికల ముందు మహిళలకు అది చేస్తాం.. ఇది చేస్తాం అంటూ నారా చంద్రబాబు హామీల వర్షం గుప్పించారు. సూపర్‌సిక్స్ అంటూ ఊరించి ఓట్లు వేయించుకున్నారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం మహిళల అభివృద్ధిని గాలికి వదిలేసింది. మహిళా సంక్షేమానికి ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా చంద్రబాబు ప్రభుత్వం మోసం చేసిందని పలువురు విమర్శిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో మహిళా సంక్షేమానికి పెద్దపీట వేసింది. వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటును అందించింది. చరిత్రలో ఎన్నడూలేని విధంగా మహిళల పేరు మీద ఇంటి పట్టాలు మంజూరు చేయడంతోపాటు మహిళలు వారి కాళ్లపై వారు నిలబడే విధంగా సున్నా వడ్డీ రుణాలు, ఆసరా, చేయూత, కాపునేస్తం, ఈబీసీ నేస్తం వంటి విప్లవాత్మక పథకాలను అమలు చేస్తూ మహిళలే మహారాణులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేసింది. అయితే కూటమి ప్రభుత్వం పాలన చేపట్టి ఏడాది పూర్తయినా మహిళలకు సంక్షేమ పథకాలు అందని ద్రాక్షలా ఉన్నాయని మహిళాలోకం మండిపడుతుంది.

వైఎస్సార్‌సీపీ పాలనలో...

వైఎస్సార్‌సీపీ పాలనలో మహిళలను అభివృద్ధి పథంలో నడిపించే విధంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎనలేని కృషి చేశారు. జగనన్న అమలు చేసిన పథకాల్లో పోలవరం నియోజకవర్గంలోని మహిళలు అనేక రకాలుగా అభివృద్ధి పొందారు. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా 72,209 మంది అక్కచెల్లెమ్మలకు సుమారు రూ.114.29 కోట్లు అందించారు. అమ్మ ఒడి పథకం కింద సుమారు 89,220 మంది తల్లులకు రూ. 133.83 కోట్లు, కాపునేస్తం పథకంలో 3,776 మంది లబ్ధిదారులకు రూ. 9.09 కోట్లు, వైఎస్సార్ చేయూతగా 18,557 మంది లబ్ధిదారులకు రూ. 58.14 కోట్లు జమ చేశారు. అదేవిధంగా చిరు వ్యాపారులకు జగనన్న తోడు పథకంలో సుమారు 8,516 మంది వ్యాపారులకు జమ వడ్డీలేని రుణాలుగా రూ. 8.5 కోట్లు ఇచ్చారు.

హామీలు అమలు చేయాలి



కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలి. ప్రజలను ఇంకెంత కాలం మోసం చేస్తారు. జగన్ హయాంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా, కరోనాతో అభివృద్ధి కుంటు పడినా సంక్షేమాన్ని మాత్రం విస్మరించలేదు. అనుకున్న సమయానికి లబ్ధిదారుల ఖాతాల్లో సొమ్ము జమచేసి చరిత్ర సృష్టించారు.

– కె దినేష్ రెడ్డి, వైఎస్సార్ సీపీ యూత్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

మహిళల అభివృద్ధికి జగన్ ఎనలేని కృషి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో మహిళల అభివృద్ధికి జగనన్న ఎనలేని కృషి చేశారు. చరిత్రలో ఎన్నడూలేని విధంగా మహిళల పేరుమీదే పట్టాలను అందించారు. అదేవిధంగా సున్నా వడ్డీ రుణాలు, ఆసరా, చేయూత, కాపునేస్తం, ఈబీసీ నేస్తం వంటి పథకాల ద్వారా మహిళల ఖాతాలోకి సొమ్ములు చెల్లించేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఏ పథకాలు అమలు కాకపోవడం వల్ల ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

– మొడియం రామతులసి, జెడ్పీటీసీ, బుట్టాయగూడెం మండలం

వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయాలి

- పొంగుటూరులో పోస్టర్ ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే బాలరాజు
- శివపురంలో పోస్టర్ విడుదల చేసిన కంభం విజయరాజు


కొయ్యలగూడెం: పొంగుటూరులో పోస్టర్లని ఆవిష్కరిస్తున్న తెల్లం బాలరాజు


చింతలపూడి: శివపురంలో పోస్టర్‌ను విడుదల చేస్తున్న విజయరాజు, పార్టీ శ్రేణులు

కొయ్యలగూడెం: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల 4వ తేదీన నిర్వహించే వెన్నుపోటు దినాన్ని ప్రజల మద్దతుతో పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పిలుపు ఇచ్చారు. ఆదివారం పొంగుటూరులోని వైఎస్సార్‌సీపీ నాయకులు గేలం వెంకటేశ్వరరావు నివాసం వద్ద, సర్పంచ్ పసుపులేటి రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కూటమి నేతల మాటలు నమ్మి ప్రజలు వారికి అధికారం అప్పగిస్తే ఇచ్చిన హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వం కళ్లు తెరవడానికే రాష్ట్రవ్యాప్తంగా వెన్నుపోటు దినం కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా ఇచ్చిన ఆరు పథకాలు తక్షణమే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రెడ్ బుక్ రాజ్యాంగం అమలుకే కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని, సంక్షేమ పాలనను విస్మరించిందన్నారు. ఈ నేపథ్యంలో కొయ్యలగూడెంలోని గణేష్ సెంటర్లో 4వ తేదీ ఉదయం తొమ్మిది గంటలకు నియోజకవర్గ స్థాయిలో నిరసన, ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అనంతరం ప్రజల మద్దతుతో పార్టీ శ్రేణులు భారీ ర్యాలీ చేపట్టనున్నాయి అని బాలరాజు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ఏడు మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు పార్టీ నాయకులు, క్రియాశీలక సభ్యులు, కార్యకర్తలు హాజరు కావాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ తుమ్మలపల్లి గంగరాజు, జిల్లా అధికార ప్రతినిధి దాసరి విష్ణు, ఎంపీపీ గంజిమాల రామారావు, పార్టీ నాయకులు గొడ్డటి నాగేశ్వరరావు, గంటా శ్రీను, మేకల అన్నవరం, చిక్కాల దుర్గాప్రసాద్, దూలపల్లి కాంతారావు, విగ్గిన రామకృష్ణ, మందపాటి రామకృష్ణ, నూకల రాము, గేలం శ్రీను, సంకుకొండ, ఎస్‌కే బాజీ, మారిశెట్టి శ్రీను, చిటికెన నాగార్జున, తోట శ్రీను, గుండుమోలు మూర్తి, రాజనాల వెంకటేశ్వరరావు, పాముల నాగమునిస్వామి, ఏలేటి భాస్కర్, గంటా రమేష్, తదితరులు పాల్గొన్నారు.

నమ్మించి వంచించడమే చంద్రబాబు నైజం

చింతలపూడి: ప్రజలను నమ్మించి అధికారంలోకి రావడమే చంద్రబాబు అసలు నైజమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 4 న తలపెట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మండలంలోని శివపురం గ్రామంలో ఆదివారం వెన్నుపోటు దినం కార్యక్రమ పోస్టర్‌ను కంభం విజయరాజు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు జగ్గవరపు జానకిరెడ్డి, పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా ఇచ్చిన్న హామీలను ఇప్పటి వరకు కూటమి ప్రభుత్వం నెరవేర్చలేదని మండిపడ్డారు. పేదలను నమ్మించి మోసం చేసిన చంద్రబాబుకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు జగ్గవరపు జానకి రెడ్డి మాట్లాడుతూ ఆడబిడ్డ నిధి కింద 18 నుంచి 59 ఏళ్ల లోపు వయస్సు ఉన్న మహిళలకు నెలకు రూ.1500 చొప్పున ఏడాదికి 18 వేలు అందజేస్తామని చెప్పి మహిళలను మోసం చేశారని అన్నారు. ఉచిత బస్సు, గ్యాస్ సిలెండర్ల పంపిణీ అంతా మోసమేనన్నారు. వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ లింగపాలెం మండల అధ్యక్షుడు కొటారి మోహన్, త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, ఎం ఇమ్మానియేలు, ఎ సుబ్బారావు, నరుకుళ్ళ రవీంద్ర, కొప్పుల నాగు, కె దినేష్ రెడ్డి, మిర్యాల దిలీప్, ఎస్ దుర్గారావు, గొల్కొండ సురేష్, దాసు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాలపై నిరసన


ధర్మాజీగూడెంలో వెన్నుపోటు దినం పోస్టర్‌ను విడుదల చేస్తున్న విజయరాజు, వైఎస్సార్ సీపీ నేతలు

లింగపాలెం: సీఎం చంద్రబాబు మోసాలపై నిరసన తెలియజేస్తూ ఈనెల 4న వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో తలపెట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని ఆ పార్టీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు పిలుపునిచ్చారు. ఆదివారం ధర్మాజీగూడెంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వెన్నుపోటు దినం కార్యక్రమ పోస్టర్‌ను విడుదుల చేశారు. అనంతరం విజయరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు, మోసపూరితమైన హామీలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రెడ్ బుక్ రాజ్యాంగం ప్రజల పాలిట శాపంగా మారిందన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో చంద్రబాబు ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మట్టా సురేష్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు బీవీఎస్ రెడ్డి, ఉప్పలపాటి వరప్రసాద్, ముసునూరి వెంకటేశ్వరరావు, అన్నపనేని శాంతారావు, లిడ్ క్యాప్ మాజీ డైరెక్టర్ సొంగా సందీప్, నాయకలు బి ప్రసాద్‌రెడ్డి, బి ప్రభాకరెడ్డి, చీదరాల ప్రసాద్, టి జయరాజు, కె అంకమయ్య, గణేష్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

చేతకాని పాలనపై పోరాటానికి సిద్ధం కావాలి


వెన్నుపోటు దినం పోస్టర్‌లను ప్రదర్శిస్తున్న మాజీ హోం మంత్రి తానేటి వనిత తదితరులు

ద్వారకాతిరుమల: చేతకాని పాలనపై పోరాటానికి ప్రజలు సిద్ధం కావాలని రాష్ట్ర మాజీ హోం మంత్రి, వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనిత పిలుపునిచ్చారు. నియోజకవర్గ కేంద్రమైన గోపాలపురంలో ఆదివారం ఆమె నాలుగు మండలాల్లోని పార్టీ నేతలతో కలసి వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మోసపూరిత హామీలతో కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను నట్టేట ముంచిందన్నారు. తల్లికి వందనం పథకం ఏమైందని ప్రభుత్వాన్ని ఆమె ప్రశ్నించారు. బాబు వస్తే జాబు గ్యారెంటీ అని ఎన్నికల సమయంలో ఊదరగొట్టి అధికారంలోకి వచ్చాక ఏడాది పాలనలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలన్నారు. అన్నదాత సుఖీభవ పేరుతో ఏడాదికి రూ. 20 వేలు ఇస్తామని రైతులను మోసం చేయలేదా అని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకపోతే చొక్కా పట్టుకుని నిలదీయాలని ఎన్నికల సమయంలో నారా లోకేష్ అన్నారని, ప్రజలకు ఇప్పుడు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లో వైఫల్యం చెందిందన్నారు. చేతకాని చంద్రబాబు పాలనపై పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈనెల 4న వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ద్వారకాతిరుమల మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, గోపాలపురం నియోజకవర్గ మేధావుల ఫోరం అధ్యక్షుడు పాకలపాటి త్యాగ భీమేశ్వరరావు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు దాసరి రాంబాబు, దాకారపు అగ్గియ్య తదితరులున్నారు.

మళ్లీ మొదలైన రేషన్ కష్టాలు


బుట్టాయగూడెంలో రేషన్ డిపో నిర్వహణను పరిశీలిస్తున్న తహసీల్దార్ చలపతిరావు


కుక్కునూరులో రాత్రి 7 గంటలు దాటిన తరువాత రేషన్ తీసుకుంటున్న మహిళ

బుట్టాయగూడెం: కూటమి ప్రభుత్వం ఇంటింటికీ రేషన్ విధానాన్ని రద్దు చేసి మళ్లీ రేషన్ దుకాణాల వద్దే నిత్యావసర సరుకులు సరఫరా చేయడంతో మళ్లీ రేషన్ కష్టాలు మొదలయ్యాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎండీయూ వాహనాలు ఏర్పాటు చేసి ఇంటింటికీ రేషన్ అందించేశారు. కూటమి ప్రభుత్వం ఆ విధానాన్ని రద్దు చేయడంతో మళ్లీ ప్రజలు పనులు మానుకుని గంటల తరబడి రేషన్ డిపోల వద్ద పడిగాపులు పడే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా గిరిజన గ్రామాల్లోని లంకపాకల, అలివేరు పరిసర ప్రాంత గిరిజనులకు వీరమద్దిగూడెం, ఒర్రింక, గోగుమిల్లి గ్రామాల గిరిజనులు మైళ్లదూరం నడుచుకుంటూ రేషన్ దుకాణాలకు వెళ్లి నిత్యావసరాలు తెచ్చుకునే పరిస్థితి రావడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బుట్టాయగూడెంలో రేషన్ షాపు ప్రారంభం

బుట్టాయగూడెంలో రేషన్‌షాపును ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1వ తేదీ నుంచి 15వ తేదీ లోపు రేషన్ దుకాణాల వద్ద బియ్యం తీసుకోవాలన్నారు. తహసీల్దార్ పీవీ చలపతిరావు మాట్లాడుతూ రేషన్ డిపోల్లోని బియ్యం తూకాల్లో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ, సివిల్ సప్లయి ఆర్ఐ పద్మ, వీఆర్‌ఓలు, రేషన్ డిపోల డీలర్‌లు పాల్గొన్నారు.

రేషన్‌కోసం పడిగాపులు

కుక్కునూరు: ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ సరుకులను ఇంటి వద్దే అందించే విధానాన్ని కూటమి ప్రభుత్వం రద్దు చేయడంతో ఆదివారం చౌకదుకాణాల వద్ద రేషన్ కోసం ప్రజలు బారులు తీరారు. ఓ పక్క క్యూ లైన్, మరోపక్క సర్వర్ స్లోగా ఉండడంతో బయోమెట్రిక్ మెషీన్లు సరిగ్గా పనిచేయక లబ్ధిదారులు గంటల తరబడి పడిగాపులు పడ్డారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం తమ పాలిట శాపంలా మారిందని పలువురు విమర్శించారు.

రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకులు

పోలవరం రూరల్: రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీ పునః ప్రారంభమైందని తహసీల్దార్ సాయిరాజ్ తెలిపారు. ఈనెల 1 నుంచి 15వ తేదీ వరకు రేషన్ షాపుల వద్ద నిత్యావసర సరుకులు అందుబాటులో ఉంటాయని, ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, అలాగే సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు లబ్ధిదారులు రేషన్ తీసుకోవచ్చని అన్నారు. 65 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు డీలర్ల ద్వారా ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేయడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీ ట్రైకర్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు, డిప్యూటీ తహసీల్దార్ కంభంపాటి శ్రీనివాసరావు, వీఆర్‌వోలు, నాయకులు పాల్గొన్నారు.

రేషన్ షాపు ప్రారంభం


జంగారెడ్డిగూడెం రేషన్‌షాపు నంబర్ - 5ను ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో రేషన్‌షాపులను ఆదివారం పునః ప్రారంభించారు. స్థానిక 25వ వార్డులోని లక్ష్మీనారాయణ థియేటర్ పక్కన ఉన్న దుకాణం నెంబర్ 5ను మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి ప్రారంభించి, రేషన్‌కార్డు దారులకు నిత్యావసరాలు అందించారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ కనకదుర్గ, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

ఆడబిడ్డ వివాహానికి సాయం


వివాహ ఖర్చులకు సంబంధించిన నగదు అందిస్తున్న విశ్వబ్రాహ్మణులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన ఆడబిడ్డ వివాహానికి విశ్వబ్రాహ్మణులు ఆర్థిక సాయం సాయం అందించారు.ఆదివారం కామాక్షి విశ్వబ్రాహ్మణ సత్రంలో చిట్టూరి సత్యనారాయణ కుటుంబానికి విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు అప్పల భక్తుల శివకేశవరావు (శివ శ్రీ) అందచేశారు. కమ్మరి వృత్తి ద్వారా జీవనం సాగించే చిట్టూరి సత్యనారాయణ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. తన రెండవ కుమార్తె వివాహం చేసేందుకు తగిన ఆర్థిక స్థోమత లేక విశ్వబ్రాహ్మణ ఉద్యోగ వ్యాపారస్తుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు శివశ్రీని ఆశ్రయించగా శివ శ్రీ విజ్ఞప్తి మేరకు విశ్వబ్రాహ్మణ సంఘీయులు విరాట్ సేవా ట్రస్ట్, వెస్కోట్రస్ట్, ఏలూరు పట్టణ స్వర్ణకార సంఘం, శ్రీ విశ్వబ్రాహ్మణ సంఘం, వడ్రంగిపని వారల సంక్షేమ సంఘం సభ్యులు, షుమారు లక్షా ఏబై వేల రూపాయలు ఖర్చుతో వివాహం జరిపించేందుకు ముందుకొచ్చారు. ఆదివారం సంఘీయుల సమక్షంలో కొంత నగదును ఆ కుటుంబానికి అందజేశారు.

ఉత్సాహంగా సైకిల్ యాత్ర

ఏలూరు రూరల్: ప్రపంచ సైకిల్ యాత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఒక్కరూ సైకిల్ ర్యాలీలో పాల్గొనాలని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కోచ్ సందీప్ అన్నారు. ఆదివారం కేంద్ర యవజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు స్పోర్ట్స్ అథారటీ ఆఫ్ ఇండియా మేరా యువభారత్(ఎన్‌వైకే) ఆధ్వర్యంలో ఏలూరులో సైకిల్ యాత్ర నిర్వహించారు. స్థానిక సాయ్ సెంటర్ నుంచి తంగెళ్లమూడి సర్కిల్ వరకూ కొనసాగిన ర్యాలీలో క్రీడాకారులు, మేరా యువ భారత్ వలంటీర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోచ్ సందీప్ మాట్లాడుతూ యువత శారీరకంగా, మానసికంగా బలంగా ఉంటేనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందన్నారు. ఇందుకోసం క్రీడల యోగా, సైకిల్ సాధన చేయాలన్నారు. కార్యక్రమంలో మేరా యువ భారత్ వలంటీర్లు చేతనప్రసన్న, దత్తజగదీష్, రోహిత్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు చింతలపూడిలో జిల్లా స్థాయి పీజీఆర్ఎస్

ఏలూరు(మెట్రో): చింతలపూడి తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ఏలూరు జిల్లా కలెక్టరేట్‌లో కూడా యధావిధిగా సంబంధిత అధికారులతో పీజీఆర్ఎస్ నిర్వహిస్తారని పేర్కొన్నారు.